సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



● గణపతి బప్ప మోరియా

ఏడు రోజులపాటు విశేష పూజలందుకున్న గణేశునికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. కదిరిలో మంగళవారం గణేష్ నిమజ్జన శోభాయాత్ర కోలాహలంగా సాగింది. శోభాయాత్రలో యువకులు సందడిచేస్తూ ముందుకు సాగారు.

వివరాలు 8 లో

న్యూస్‌రీల్

జెడ్పీ సమావేశం వాయిదా



జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. తన చాంబర్‌లో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్యతో కలసి మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 9న సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే, 10న ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో వాయిదా వేసినట్లు వివరించారు. జిల్లా యంత్రాంగం సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో ఉన్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులకు సమాచారం చేరవేశామన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం



పెడపల్లిలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. పుట్టపర్తి, కొత్తచెరువు, గోరంట్ల, బుక్కపట్నం, ధర్మవరం, పెనుకొండ, కదిరి తదితర మండలాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది. జిల్లాకు మరో రెండు రోజులూ వర్ష సూచన ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆటో బోల్తా... ఐదుగురు విద్యార్థులకు గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు జయశ్రీ, దివ్యశ్రీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తారకరామాపురం సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో బోల్తా పడగా.. ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. ధర్మవరం టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాలలో ఉన్న 'బాయ్స్ టౌన్ పాఠశాల'కు చెందిన విద్యార్థులు మంగళవారం సాయంత్రం స్కూల్ వదిలాక ఆటోలో ఇళ్లకు వెళ్తున్నారు. తారకరామాపురం వద్ద మలుపు వద్దకు వెళ్లగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు శ్రీచైతన్య, జయశ్రీ, దివ్యశ్రీ, హర్షవర్ధన్, కార్తీక్‌లు గాయపడ్డారు. స్పందించిన స్థానికులు వెంటనే విద్యార్థులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘటన జరిగిన సమయంలో ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజన్నకు ఘన నివాళి



హిందూపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రమేష్‌రెడ్డి, టీఎన్ దీపిక తదితరులు

వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్లే నా బిడ్డ ఇంజినీర్ అయ్యాడయ్యా...ఆయన చలువతో మా జీవితాల్లో వెలుగులు నిండాయి. ఆయనే లేకపోయింటే మేము లేమయ్యా. ఆయన్ను ఎప్పటికీ మరచిపోలేం.

– ఓ మహిళ కృతజ్ఞతాంజలి ఇది..

ఆయన హయాంలో రైతు రాజుగా బతికాడు. రుణ మాఫీ, ఉచిత కరెంటు.. విత్తనాలు.. ఎరువులు ఒకటేమిటి చాలా చేశాడు. అందుకే ఆయన ఎప్పుడూ మా గుండెల్లో కొలువై ఉంటాడు.

– వైఎస్సార్‌పై ఓ రైతు అభిమానమిది

నాకిద్దరు ఆడబిడ్డలు...2006లో నా గుండెకు చిల్లుపడింది. ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమత లేదు. బిడ్డల భవిష్యత్ తలచుకుని భయపడ్డా..కానీ ఆరోగ్యశ్రీ ఆదుకుంది. కోలుకుని ఇద్దరు పిల్లల పెళ్లి చేశా. నా ఈ జీవితం రాజన్న పెట్టిన భిక్ష. ఆయనే మా దేవుడు.

– వైఎస్సార్‌కు కన్నీటితో నివాళులర్పిస్తూ పెద్దాయన చెప్పిన మాటలివి.

దివంగత నేత వైఎస్సార్ 16వ వర్ధంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని తమ అభిమాన నేతకు నీరాజనాలు అర్పించారు. ఆయన చేసిన మేళ్లను, సంక్షేమ పాలనను తలచుకున్నారు. సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి చాటారు. 'వైఎస్సార్...జోహార్' అంటూ నినదించారు.

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు
- సేవలను గుర్తు చేసుకున్న ప్రజలు
- సేవా కార్యక్రమాలతో అభిమాన నేతకు ఘన నివాళి

పుట్టపర్తి: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16 వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అన్నదానం, రక్తదానం చేశారు. పలుచోట్ల ఆస్పత్రుల్లో రోగులకు బ్రెడ్లు పంచి పెట్టారు.

❖ హిందూపురంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పాల్గొన్నారు. పట్టణంలోని పరిగి బస్టాండ్‌లో గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మధుమతిరెడ్డి కూడా వైఎస్సార్ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు.

❖ పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని నల్లమాడలో పార్టీ సీనియర్ నాయకులు దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి, పార్టీ నేతలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బుక్కపట్నంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మారాల గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

❖ మడకశిరలోని వైఎస్సార్ సర్కిల్‌లో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, శ్రేణులు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల పెన్నిధి వైఎస్సార్ అని కొనియాడారు.

❖ పెనుకొండలో మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో వైఎస్సార్ చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సమాజంలోని అన్ని వర్గాలకూ మేలు చేసిన గొప్ప పాలకులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని శంకరనారాయణ కొనియాడారు.

❖ కదిరిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, శ్రేణులు వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు. తొలుత పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వరకు వెళ్లారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

❖ ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎస్‌బీఐ కాలనీ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పీఆర్‌టీ సర్కిల్‌లో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 40వార్డుల కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

❖ రాప్తాడులో పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కురుబ నాగిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ పాలన ఒక సువర్ణయుగమని, ఆయన మరచిపోలేని, మరుపురాని గొప్ప నాయకుడని నేతలు కొనియాడారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు కె. పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు అన్నదానం చేశారు. పలుచోట్ల వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.



పెనుకొండలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ, పార్టీ నాయకులు



ధర్మవరం పీఆర్‌టీ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



మడకశిరలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు



కదిరిలో కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్



నల్లమాడలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి తదితరులు



బుక్కపట్నం మండలం మారాలలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మామిళ్లపల్లిలో పేదలకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం నాయకులు, కార్యకర్తలు

మీకోసం ప్రశ్నిస్తే మాపై కేసులా?

- పోలీసులు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- సాక్షి కార్యాలయంపై దాడి, ఎడిటర్‌పై కేసులు దుర్మార్గం
- ముక్తకంఠంతో ఖండించిన జర్నలిస్టులు



పుట్టపర్తిలో వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



పెనుకొండలో విన్నతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

పుట్టపర్తి టౌన్: ''మీకు అన్యాయం జరిగిందని మీరు చెబితే మేము వార్తలు రాశాం. మీకు అండగా నిలిచాం. అలాంటి మాకు అండగా నిలవాల్సింది పోయి అక్రమ కేసులు పెడతారా'' అంటూ జర్నలిస్టులు ప్రశ్నించారు. డీఎస్పీ పదోన్నతుల్లో జరిగిన అక్రమాలపై 'సాక్షి' కథనం ప్రచురిస్తే..తట్టుకోలేని ప్రభుత్వ పెద్దలు సోమవారం రాత్రి పోలీసులతో 'సాక్షి' విజయవాడ కార్యాలయంపై దాడి చేయించడంతో పాటు పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించారు. ఈ చర్యలను నిరసిస్తూ మంగళవారం జిల్లాలో జర్నలిస్టులు ఎక్కడికక్కడ పోలీసులకు వినతి పత్రాలు సమర్పించారు. 'సాక్షి' ఎడిటర్‌పై బనాయించిన అక్రమ కేసును వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పలువురు జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాక్షి స్టాఫ్ రిపోర్టర్ దివిటి రాజేష్ మాట్లాడుతూ.. డీఎస్పీ పదోన్నతుల్లో అక్రమాలపై పోలీసులే సాక్ష్యాలతో సహా సాక్షి మీడియా ముందుకు వస్తే... వారు చెప్పిన అంశాలనే వార్తగా రాశామన్నారు. దీంతో పోలీసులు 'సాక్షి' కార్యాలయంపై దాడి చేసి ఎడిటర్ ధనంజయరెడ్డిపై తప్పుడు కేసులు బనాయించారన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా సర్కార్ చర్యలను ఖండించాలన్నారు. కార్యక్రమంలో రిపోర్టర్లు గంగిరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

• సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని పెనుకొండలో జర్నలిస్టులు మల్లికార్జున, గోవింద్, జాకీర్‌హుస్సేన్, శ్రీనివాసులు తదితరులు డీఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసును ఎత్తివేసి పత్రికా స్వేచ్ఛను కాపాడాలన్నారు.

ప్రభుత్వం తీరు మార్చుకోవాలి

నిజాలు నిర్భయంగా రాస్తున్న పాత్రికేయులపై అక్రమ కేసులతో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని ఏపీ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సాక్షి కార్యాలయంపై దాడులకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అప్పు చెల్లించలేదని దాడి



తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు

చెన్నేకొత్తపల్లి: అప్పుతీసుకున్న వ్యక్తి సకాలంలో వడ్డీ చెల్లించకపోవడంతో రుణదాత బండరాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన మంగళవారం మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కనుముక్కల గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి వద్ద అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు ఐదేళ్ల క్రితం రూ. 33 వేల అప్పుగా తీసుకున్నాడు. ప్రతి ఏటా వడ్డీ చెల్లించేవాడన్నారు. అయితే ఈ ఏడాది ఆంజనేయులు అప్పునకు వడ్డీ చెల్లించలేక పోయాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో ఆంజనేయులు గొర్రెలు మేపుతుండగా...రుణదాత ఓబుల్‌రెడ్డి అక్కడికి వెళ్లి అప్పు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో వారి మధ్య మాటామాట పెరిగింది. తీవ్ర ఆవేశానికి లోనైన ఓబుల్‌రెడ్డి అక్కడే ఉన్న ఓ బండరాయితో దాడి చేశాడు. దీంతో ఆంజనేయులు కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే బాధితుడు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం చెన్నేకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా... పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతికి రె'వెన్యూ'

▶ పుట్టపర్తి మండలం కొట్లపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబరు 254-3లోని 4.68 ఎకరాలకు 1965లోనే ప్రభుత్వం హరిజన సుబ్బన్నకు డీ పట్టా ఇచ్చింది. ఆయన మరణాంతరం ఆయన కుమారుడు గంగాద్రి సాగులో ఉన్నాడు. అయితే ఇటీవల ఆ భూమిని అధికారులు బెంగళూరుకు వలస వెళ్లిన ముగ్గురి పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించారు. వన్-బీ, పాసు పుస్తకాలు కూడా ఇచ్చారు. దీంతో బాధితుడు తహసీల్దార్ కార్యాలయానికి రాగా.. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు.

▶ పుట్టపర్తి మండలం కప్పలబండ రెవెన్యూ పొలం సర్వే నంబరు 179-6లోని 25 సెంట్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ఒకరికి ఇచ్చారు. ప్రస్తుతం అదే నంబరుపై మరొకరి పట్టా ఇచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య భూ తగాదా మొదలైంది. ఇరువర్గాల వారు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇరువర్గాలు వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వారు కావడంతో అధికార పార్టీ సానుభూతి పరులకు ఆ భూమి దక్కింది.

▶ పెడపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబరు 665-6లోని 1.36 ఎకరాలను 40 ఏళ్ల క్రితం చంద్రనాయక్‌కు ఇచ్చారు. ఇటీవల రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమి యజమానికిగా మరొకరి పేరు చేర్చారు. సాగులో ఉన్నప్పటికీ.. రికార్డుల పరంగా వేరొకరి వస్తుండటంతో బాధితుడు రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. సాగుకు అడ్డం వస్తే.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లు.. రెవెన్యూ రికార్డుల్లో అవకతవకలతో ఏం కాదులే ఓ అధికారి రైతుకు చెప్పినట్లు తెలిసింది.

- మండల రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతి బాగోతం
- ప్రతి మండలంలోనూ వెలుగు చూస్తున్న భూ తగాదాలు
- 'ప్రజా సమస్యల పరిష్కారవేదిక'ను ఆశ్రయిస్తున్న బాధితులు
- కూటమి నేతల ఒత్తిళ్లతో అధికారుల తప్పిదాలు
- కొత్తచెరువు, పుట్టపర్తి, గోరంట్ల, చిలమత్తూరు మండలాల్లో అధికం



సాక్షి, పుట్టపర్తి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల భూములకు రక్షణ లేకుండా పోయింది. అధికారం అండతో కొందరు నేతలు ఇతర పార్టీల సానుభూతి పరుల భూముల రికార్డులను తారుమారు చేస్తున్నారు. ఏళ్లుగా సాగులో ఉన్నా... రాజకీయ కుట్రలతో రికార్డుల నుంచి పేర్లు తొలగించి.. తమకు అనుకూలమైన వారి పేర్లు చేరుస్తున్నారు. తాము చెప్పినట్లు వినకపోతే బదిలీ తప్పదని బెదిరిస్తుండటంతో కూటమి నేతలు చెప్పిన వాటికంతా అధికారులు తలూపుతున్నారు.

'పరిష్కార వేదిక'కు బాధితులు

ఏళ్లుగా సాగులో ఉన్నప్పటికీ రికార్డుల్లో మరొకరి పేరు చూపుతుండటంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు మరొకరి చెందుతున్నాయి. దీంతో బాధితులు తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదిస్తే.. ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని సూచిస్తున్నారు. ఆ తర్వాత సర్వే చేస్తామని మాట దాటవేసి.. పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే బాధితులంతా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు తరలివస్తున్నారు. న్యాయం చేయండయ్యా అంటూ కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. కానీ వారి అర్జీలన్నీ మళ్లీ తహసీల్దార్ కార్యాలయాలకే చేరుతుండగా... సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మరికొందరు బాధితులు తమ భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని పోలీస్ స్టేషన్లు మెట్లు ఎక్కుతున్నారు. అయితే సివిల్ పంచాయితీతో తమకు సంబంధం లేదని పోలీసులు తేల్చి చెబుతున్నారు.

భూములకు రక్షణ కరువు

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కూటమి పార్టీల నాయకులు కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులనే పావులుగా వాడుకుంటూ.. భూదందాలు చేస్తున్నారు. ఈక్రమంలోనే డీ-పట్టా భూములకు రక్షణ లేకుండా పోయింది. 40 ఏళ్లుగా సాగులో ఉన్నా.. రికార్డుల్లో పేర్లు మార్చి పంచాయితీలు చేస్తున్నారు. చివరకు సరిహద్దులో దేశానికి కాపలాకాసే సైనికుల భూములు కాజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన భూములను లాగేసుకుంటున్నారు.

అక్కడే ఎక్కువగా..

భూమి విలువ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే భూ తగాదాలు పెరుగుతున్నాయి. పుట్టపర్తి, కొత్తచెరువు, చిలమత్తూరు సోమందేపల్లి, పెనుకొండ, గోరంట్ల మండలాల నుంచి ప్రతి వారం భూ సమస్యలతో బాధితులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. పదే పదే ఫిర్యాదు ఇచ్చినా... ఫలితం లేదని వాపోతున్నారు. పైగా ఫిర్యాదును పరిశీలించిన అధికారులు.. రాజకీయ నాయకుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారని వాపోతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

పుట్టపర్తి మండలం పెడపల్లిలో ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి భవనం నిర్మించారు. స్థానికులు కలెక్టర్ చేతన్‌కు ఫిర్యాదు చేయగా.. స్పందించిన ఆయన కూల్చేయాలని ఆదేశాలిచ్చారు. అయితే జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి ఈ అంశంలో జోక్యం చేసుకున్నారు. ఫిర్యాదు చేసిన వారెవరో తన వద్దకు వచ్చేలా చూడాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ భవనం కూల్చరాదని అధికారులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో ఆ భవనం కూల్చేందుకు అధికారులెవరూ సాహసం చేయడంలేదు. పైగా మాజీ మంత్రి చర్యలతో ఫిర్యాదుదారులూ భయపడ్డారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం

ముదిగుబ్బ: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.ఫైరోజాబేగం ఆదేశించారు. మంగళవారం మలకవేమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పీహెచ్సీలో జరుగుతున్న ఆశా డే కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్ఎన్ మంజుల, ఎంపీహెచ్ఎస్ అలివేలమ్మ, సీహెచ్ఓలు భార్గవి, జ్యోతి, మీనా, ఎంపీహెచ్ఏ హరినాథ్ రెడ్డి, ఏఎన్ఎం పార్వతి, సరస్వతమ్మ, సుజాత, రాజేశ్వరి, సిబ్బంది వినయ్‌కుమార్, శైలజ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

కదిరి అర్బన్: ఆశా వర్కర్లు తమ లక్ష్యాలను పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం ఆదేశించారు. మంగళవారం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆశాడేని పురస్కరించుకుని ఆశాలతో సమావేశం నిర్వహించారు. ఆశాలు తమకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

రాతిపై నుంచి పడి యువకుడి మృతి


మృతుడు సుబ్రహ్మణ్యం

పుట్టపర్తి: రాతిపైనుంచి కింద ఉన్న రాళ్ల మధ్యలోకి జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం (34) రాశింపల్లి సమీపంలోని గుట్టలో రాళ్లు కొట్టుకొని జీవనం సాగిస్తుండేవాడు. మంగళవారం ఉదయం గుట్టలోకి దారి నిమిత్తం జేసీబీతో పని చేయిస్తుండగా రాతిపై నుంచి కింద ఉన్న రెండు రాళ్ల మధ్యలోకి పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేశారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించొద్దు

పెనుకొండ: పట్టణంలోని హోటళ్లు, బేకరీలపై మున్సిపల్, రెవెన్యూ, శానిటరీ అధికారులు సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించరాదని, అక్కడున్న పలు ప్లాస్టిక్ సింగిల్ యూజ్ గ్లాసులను సీజ్ చేశారు. హోటళ్లు, బేకరీల కిచెన్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. సిబ్బంది చేతులకు గ్లౌజులు, తలకు టోపీలు వాడాలన్నారు. తినుబండారాలపై దోమలు వాలకుండా చూడాలన్నారు. ఇడ్లీ పాత్రలపై సింగిల్ యూజ్, ప్లాస్టిక్ పేపర్లను వినియోగించరాదన్నారు.


స్వామివారి వాహనాన్ని లాగుతున్న ముస్లింలు


క్రేన్ సాయంతో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం


వివిధ రకాల వేషధారణలతో సందడి

గణపతి బప్పా మోరియా


నిమజ్జనానికి వెళుతున్న సింహకోట వినాయకుడు

కదిరి: గణేశ్ నామస్మరణతో కదిరి పురవీధులు పులకించాయి. వినాయక చవితి రోజున వాడవాడలా కొలువుదీరిన వినాయక విగ్రహాలకు ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఏడవ రోజు మంగళవారం నిమజ్జనం–శోభాయాత్ర నిర్వహించారు. తొలుత మండపాల వద్ద గణేశునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో ప్రతిమలను కొలువుదీర్చారు. ఇక నృసింహాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా.. నిర్ణయించిన శుభ ఘడియల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు భక్తులు స్వామివారి వాహనాన్ని లాగి ప్రారంభించారు. సింహకోట, ఎర్రకోట, శివాలయం, రైల్వేగణేష్ విగ్రహాలను మాత్రమే గతంలో హిందూ, ముస్లింలు కలిసి చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆలంఖాన్ వలి మసీదు ముందు నుంచి తీసుకెళ్లారు. మిగిలిన విగ్రహాలన్నీ హిందూపూర్ సర్కిల్ మీదుగా నిమజ్జన ప్రదేశం రామనారాయణకుంటకు వెళ్లాయి. ఎస్పీ రత్న దగ్గరుండి బందోబస్తును పర్యవేక్షించారు. సుమారు 400 మంది దాకా పోలీసులు బందోబస్త్‌లో పాల్గొన్నట్లు ఎస్పీ తెలిపారు.

ఉల్లాసం..ఉత్సాహం

చిన్నా, పెద్దా, ఆడ, మగ, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా పట్టణ ప్రజలు గణేశ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. యువకులు శోభాయాత్రలో చిందులు వేస్తూ ముందుకు సాగారు. పలు వీధుల నుంచి వచ్చిన గణనాథులు తెల్లని కాంతులతో ఆకాశ హర్మ్యలతో పోటీ పడ్డాయి. బాణసంచా ఆకాశాన కాంతులీనుతుండగా అందరూ రంగులు చల్లుకొని మెరుపులై మెరిశారు. భక్త జనుల గణేశ నామస్మరణల మధ్య పార్వతీ తనయుడికి ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో ఉన్న రామనారాయణ కుంటలో క్రేన్‌ల సాయంతో నిమజ్జనం చేశారు. ఈసారి ముస్లింలు స్వామివారి వాహనాన్ని లాగడం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది.


కదిరిలో యువత ఉత్సాహం


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం


వినాయకుడి ముందు చెక్క భజన


భక్తులకు శీతల పానీయాలు పంచిపెడుతున్న ముస్లింలు


భక్తులను ఆకట్టుకున్న కేరళ వాయిద్యాలు


శోభాయాత్రను వీక్షిస్తున్న భక్తులతో ఎస్పీ రత్న

వ్యవస్థలన్నీ సర్వనాశనం

- మోదీ ఆశయ సాధనలో బాబు–పవన్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం


మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

లేపాక్షి: కూటమి పాలనలో వ్యవస్థలన్నింటినీ సర్వనాశనమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. మంగళవారం లేపాక్షిలోని టూరిజం గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేపరం చేయాలన్న ప్రధాని నరేంద్రమోదీ ఆశయ సాధనకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, యూనివర్సిటీలను ప్రైవేటుపరం చేయడానికి పూనుకున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేస్తే చంద్రబాబు చరిత్రహీనుడవుతారని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ఈ నెల నాలుగో తేదీన విశాఖలో అన్ని కార్మిక, ప్రజా, రాజకీయ సంఘాలతో ఒక సమైక్య ఉద్యమం చేపడతామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే అవకావాలు ఉన్నా ప్రైవేటుపరం చేయడానికి సమాయత్తమవుతున్నారని, దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, రూ.260 యూరియా బస్తాను రూ.500కు విక్రయిస్తున్నారని, డీపీపీపైనా రూ.200 అదనంగా దండుకుంటున్నారని మండిపడ్డారు. జన గణనతోపాటు కుల గణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, మండల కార్యదర్శి గౌతమ్ పాల్గొనఆనరు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం


నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అధికారులు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్, అనుబంధ విభాగాల్లో పని చేసే ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా తాము పని చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జెడ్పీ, అనుబంధ విభాగాల్లో పని చేస్తూ అకాల మృత్యువాతపడ్డ ఉద్యోగులకు సంబంధించిన వారసులు తొమ్మిది మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశం కల్పించారు. వారందరికీ జెడ్పీ చైర్‌పర్సన్ తన చాంబర్‌లో నియామకపత్రాలను మంగళవారం అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో ఎన్.మమత (పీఆర్ఐ సబ్ డివిజన్–మడకశిర), శోభ (ఎంపీపీ ఆఫీస్–మడకశిర), కేఆర్ రాఘవేంద్రరావు (ఎంపీపీ ఆఫీస్ –శెట్టూరు), వి.శకుంతల (జెడ్పీహెచ్ఎస్ – చెన్నేకొత్తపల్లి), సి.భార్గవి (జెడ్పీహెచ్ఎస్ – చుక్కలూరు), వై.ప్రసన్నకుమార్, పి.దీపక్ (జెడ్పీ–అనంతపురం), కె.బంధ నవాజ్ (పీఆర్ఐ, పీఐయూ–అనంతపురం), ఎస్.ధనలక్ష్మి (ఎంపీపీ ఆఫీస్ –బుక్కరాయసముద్రం) ఉన్నారు. వారినుద్దేశించి చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో బాధ్యతలను సమర్థవంతంగా అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య, ఏఓలు షబ్బీర్ నియాజ్, విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై ఆటో డ్రైవర్ దాడి


చికిత్స పొందుతున్న బాధితురాలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో మతిస్థిమితం లేని యువతిపై మంగళవారం ఆటో డ్రైవర్ ముబారక్ మద్యం మత్తులో మటన్ కొట్టే కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యువతిని అభిజ్ఞ ఫౌండేషన్ సభ్యులు అలి, స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కియా చేయూత


భూమి పూజ చేస్తున్న కియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

పరిగి: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కియా ఇండియా చేయూత నందిస్తుందని చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్యాంగ్ లీ తెలిపారు. మంగళవారం ఆయన పరిగి మండలం కొడిగెనహళ్లిలో ఆంధ్రప్రదేశ్ గురుకుల ఆశ్రమ జూనియర్ కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు భవనాల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఇటీవల కళాశాలలో కియా ఇండియా ఆర్థిక సౌజన్యంతో రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇటీవలే పూర్తయిన శానిటేషన్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం కళాశాలలో నిర్మించతలపెట్టిన డార్మెటరీ, డైనింగ్ హాల్, వేడి నీటి కోసం సోలార్ సిస్టమ్‌కు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీలమ్మ, శ్రీదేవి, బోధన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీలా పడ్డ అంగన్‌వాడీలు

- కూటమి ప్రభుత్వ తీరుపై అసంతృప్తి
- కనీస వేతనం అమలుపై స్పందన లేదు
- పాత ఫోన్లతోనే ఆన్‌లైన్ పనులకు హుకుం


పుట్టపర్తిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ, సీఐటీయూ నాయకులు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: అంగన్‌వాడీల డిమాండ్లపై ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సానుకూలత లభించలేదు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ధరలకు అనుగుణంగా కూరగాయల బిల్లులు పెంచాలని, వివిధ రకాల యాప్‌లతో చేసిన పనినే మళ్లీ మళ్లీ చేసే విధానం నుంచి విముక్తి కల్పించి ఒకే యాప్ ప్రవేశపెట్టాలని, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్పు చేయాలని తదితర డిమాండ్లతో ఆందోళనలు చేస్తున్నారు. ధర్నాలు–ఆందోళనలు చేసిన రోజులకు ప్రభుత్వం వేతనాల్లో కోత విధిస్తున్నా వెనక్కు తగ్గకుండా డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్నారు.

పనులు బారెడు.. వేతనం మూరెడు..

చిన్నారులకు ఆట పాటలతో పూర్వప్రాథమిక విద్య నేర్పి, గర్భిణులు, బాలింతలకు యాప్ ద్వారా ఫొటోలు తీసి పౌష్టికాహారం అందజేయడం, ఆరోగ్య విషయాలు వైద్య సిబ్బందికి తెలియజేయడం, సర్వేలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారం యాప్‌లలో నమోదు చేయడం, వంటి ఎన్నో కార్యక్రమాలను అంగన్‌వాడీ వర్కర్లు చేస్తున్నారు. అయినా మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లకు రూ.11,500, మినీ అంగన్‌వాడీ సెంటర్ల వర్కర్లకు రూ.7,500 చెల్లిస్తున్నారు. ఇక కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, లబ్ధిదారులకు భోజనం వండి పెట్టి పాత్రలను, కేంద్రాన్ని శుభ్రం చేసే ఆయాలకు రూ.7,500 ఇస్తున్నారు. ఇది ఏమాత్రమూ చాలడం లేదని అంగన్‌వాడీలు చెబుతున్నారు. దీంతో పాటు కేంద్రాలకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, గ్యాస్, తదితరాలకు బిల్లులు నెలల తరబడి విడుదల చేయకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించిందంటున్నారు.

ఫోన్లు పనిచేయకున్నా తప్పని చీవాట్లు

2జీ సెల్‌ఫోన్లలో ఐసీడీఎస్ యాప్‌లు సరిగా పనిచేయడం లేదు. అంగన్‌వాడీ సేవలకు సంబంధించిన సమాచారం ఆన్‌లైన్‌లో సకాలంలో పంపకపోయినా, నెట్‌వర్క్ కారణంగా సెల్‌ఫోన్లు పనిచేయకపోయినా వర్కర్లకు అధికారుల నుంచి చీవాట్లు తప్పడం లేదు. లక్ష్యం చేరుకోలేదంటూ పలువురికి షోకాజ్ నోటీసులు సైతం జారీ చేస్తున్నారు. 5జీ సామర్థ్యంతో కూడిన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, ఒకే యాప్ అమలు చేయాలని ఇటీవల అంగన్‌వాడీలు పాత సెల్‌ఫోన్లు వెనక్కు ఇచ్చేశారు. అయితే ప్రభుత్వం కొత్తవి ఇవ్వకుండా... పాతవే మళ్లీ అంటగట్టి వివరాలు నమోదు చేయాలంటూ సిబ్బందిపై ఉన్నతాధికారులు హుకుం జారీ చేశారు.

జిల్లా గణాంకాలు

మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	2,207
మినీ అంగన్‌వాడీలు	617
అంగన్‌వాడీ వర్కర్లు	2,884
లబ్ధిదారులు (గర్భిణులు, బాలింతలు, చిన్నారులు)	1,07,082

నెట్‌వర్క్–సిగ్నల్స్ సమస్యతో యాప్‌లు సరిగా పనిచేయక సిబ్బంది సతమతమవుతూనే ఉన్నారు. మరోవైపు లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్ కాకపోతే సరుకులు ఇవ్వలేని పరిస్థితి. దీంతో తరచూ లబ్ధిదారులతోనూ ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీల సమస్యలపై చర్చలకు పిలిచినా పూర్తిస్థాయిలో పరిష్కారాలు కాలేదు. వేతనం పెంపుపైన, యాప్‌ల భారం తగ్గింపుపైన, ధరలకు అనుగుణంగా బిల్లుల పెంపుపైన స్పష్టత ఇవ్వలేదు. దీంతో అంగన్‌వాడీలు మరోమారు డీలా పడాల్సి వచ్చింది.

కనీస వేతనం అమలు చేయాలి



ఎప్పటి నుంచో అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అడుగుతున్నాం. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. లక్ష్యాలను చేరుకోవాలని అంగన్‌వాడీలను ఇబ్బంది పెడుతున్నారు. చాలీచాలనీ జీతాలతో పాటు నిత్యావసరాల కొనుగోలుకు డబ్బు చెల్లించకపోతే ఎలా? అటవీ గ్రామాలు, మారుమూల గ్రామాల్లో సిగ్నల్స్ అందక వర్కర్లు ఇబ్బంది పడుతున్నారు. యాప్‌ల భారం తగ్గించాలి.

– మాబున్నీసా, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

ఒప్పందాలు అమలు చేయాలి



గత సమ్మెలో ప్రభుత్వం పలు డిమాండ్లను ఒప్పుకుంది. ఆ ఒప్పందాలను వెంటనే అమలు చేయాలి. జీతాలతో పాటు గ్రాట్యుటీ సమస్యలు పరిష్కరించాలి. కేంద్రాలకు వసతులు కల్పించాలి. పని చేయని యాప్‌లను తొలగించి ఒకేయాప్ విధానం తీసుకురావాలి. డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలు కొనసాగిస్తాం.

– ఎస్ వెంకటేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి